ప్రజాశక్తి

సోమవారం 1 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఒంగోలులో 'సుందరకాండ' సందడి

శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

కేక్ కటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సుందర కాండ చిత్ర బృందం ఒంగోలులో ఆదివారం సందడి చేసింది. సందీప్ పిక్చర్స్ ప్యాలెస్ బ్యానర్‌లో నారా రోహిత్ ప్రధాన పాత్రలో శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘాని హీరోయిన్లుగా దర్శకుడు వెంకటేష్ నిమ్మల పూడి రూపొందించిన సుందర కాండ చిత్రం ఆగస్టు 27న విడుదలై విజయ వంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రేక్షకులను కృతజ్ఞతలు తెలిపేందుకు సుందర కాండ చిత్ర బృందం విజయోత్సవ యాత్ర చేపట్టింది. శనివారం విశాఖ పట్టణంలో ప్రారంభమైన విజయోత్సవ యాత్ర రాత్రికి విజయవాడలో బస చేసింది. ఆదివారం ఉదయం గుంటూరు నుంచి బయలుదేరి ఒంగోలు వచ్చింది. స్థానిక గోరంట్ల కాంప్లెక్స్‌కు చేరుకున్న చిత్ర బృందానికి థియేటర్ యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పాల్గొన్నారు. సినీ రంగంలో హీరోగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎమ్మెల్యే దామచర్ల హీరో రోహిత్ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హీరో నారా రోహిత్ విభిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరి స్తున్నారన్నారు. ఇటీవల విడుదలైన సుందర కాండ విజయాన్ని సొంతం చేసుకోవటం సంతోషంగా ఉందన్నారు. చిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా హీరో నారా రోహిత్ ప్రేక్షకులతో ముచ్చటించారు.సినిమా ఎలా ఉంది, కామెడీ నచ్చిందా అంటూ ప్రేక్షకులను ▶ 2లో

జిల్లాల విభజనపై ..

మంత్రుల కమిటీ ఎటుపోయిందో..?

- నాన్చుడు ధోరణితో కొత్త వివాదాలు
- మార్కాపురం జిల్లా ప్రతిపాదనలో శ్రీశైలం అంశం
- కొత్త వివాదాలకు తావివ్వద్దని మంత్రి డోలా వివరణ

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

నెలరోజుల్లో జిల్లాల పునర్విభజన, పేర్లు మార్పులు చేర్పులపై నివేదిక ఇవ్వాలని సిఎం చంద్రబాబు మంత్రుల కమిటీని ఆదేశించారు. సిఎం ఆదేశించి నెలరోజులు కావస్తోంది. ఇటీవల అమరావతిలో జిల్లా విభజనపై ఏర్పాటైన మంత్రుల కమిటీతో భేటీ నిర్వహించారు. త్వరలోనే జిల్లాల్లో పర్యటించి అందరి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించారు. ఆ సమయంలోనే మంత్రి డోలా వీరాంజనేయస్వామి కూడా మంత్రుల కమిటీని కలిసి కొన్ని మార్పులు, చేర్పులు సూచిస్తూ తన అభిప్రాయాన్ని విన్నవించారు. ఎమ్మెల్యే జనార్దన్ కూడా కమిటీకి లేఖ రాస్తూ మార్కాపురం జిల్లానువెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకాశంజిల్లాలో అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను కలపాలని కూడా కోరారు. ఈ కమిటీలో ఇద్దరు మంత్రులు ఈనెల 30న జిల్లాకు వస్తున్నట్లు వారం క్రితం సమాచారం అందింది. అందరూ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న మంత్రుల రాకకోసం ఎదురు చూశారు.అయితే కారణాలేమిటో తెలియదు గానీ మంత్రులు రాలేదు.అధికారులకు కూడా సమాచారం లేదు.కమిటీ ఎటుపోయిందో తెలియదు. దాని వ్యవహారం తెరమరుగైంది. జిల్లాల విభజన, కొత్తగా తీసుకోవాల్సిన మార్పులపై నాన్చుడు ధోరణి కొన సాగుతోంది. సాగదీత వల్ల అనేక సమ స్యలు కొత్తగా తెరపైకి వస్తున్నాయి. వాటికి మళ్లీ పాలకపక్షనేతలే సమాధానాలు ఇవ్వాల్సిన పరిస్థితి కూడా వస్తోంది. ఇదంతా ఎందుకనే చర్చ కూడా లేకపోలేదు. తాజాగా మార్కాపురం జిల్లా ప్రతిపాదనలోకి శ్రీశైలం నియోజకవర్గం కలపాలనే చర్చ పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చింది. దీనిపై ▶ 2లో

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

- డెంగీ, మలేరియాపై అప్రమత్తత
- అతిసారను విస్మరిస్తే అధోగతే
- పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరం
- ప్రజలను హెచ్చరిస్తున్న వైద్యులు



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వర్షాకాలం వ్యాధులను మోసుకొచ్చే కాలం. వాతావరణ మార్పుతో వచ్చే ఆరోగ్య సమస్యలతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు. అతిసారను విస్మరిస్తే అధోగతి పాలయ్యే పరిస్థితి వస్తుందని చెబు తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరం కావచ్చని సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

వాతావరణంలో వచ్చే మార్పులతో వివిధ రకాల వ్యాధులు ప్రబలుతాయి. వీటిని 'సీజనల్ వ్యాధులు'గా పిలుస్తారు. ఈ వ్యాధులకు కారణాలు, వాటి లక్షణాలు, నివారణ మార్గాలు తెలుసుకుందాం.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు

వర్షాకాలంలో వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు, ఇతర సూక్ష్మక్రిములు వద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయి.

డెంగీ, మలేరి

దోమల ద్వారా ఈ వ్యాధులు వ్యాపిస్తాయి. అధిక జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన కీళ్ల నొప్పులు వంటివి లక్షణాలుగా ఉంటాయి.

చికున్‌గున్యా : ఇది కూడా దోమల ద్వారా వ్యాపిస్తుంది. అధిక జ్వరం, తీవ్రమైన, తరచుగా బలహీనపరిచే కీళ్ల నొప్పి (ఇది వారాలు లేదా నెలల తరబడి కొనసాగవచ్చు), కండరాల నొప్పి, తలనొప్పి, అలసట, దద్దుర్లు ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు

టైఫాయిడ్ : కలుషితమైన ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి వస్తుంది. జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు వ్యాధి ప్రధాన లక్షణాలు.

వైరల్ ఫీవర్, ఫ్లూ : వాతావరణ మార్పులతో వైరస్‌లు సులభంగా వ్యాపిస్తాయి. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరం వంటివి వ్యాధి లక్షణాలు. గ్యాస్ట్రోఎంటెరిటిస్ (అతిసారం మరియు డీసెంటరీ) వివిధ వైరస్‌లు బ్యాక్టీరియా లేదా పరాన్నజీవులతో కడుపు, ప్రేగులలో వాపు వచ్చి ఫుడ్ పాయిజనింగ్, కడుపు ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తోంది. వికారం, వాంతులు, నీళ్ల విరేచనాలు, కడుపులో తిమ్మిర్లు వ్యాధి లక్షణాలు. కొన్ని సందర్భాలలో జ్వరం కూడా వస్తుంది.

కలరా: ఇది విబ్రియో కలరా అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే తీవ్రమైన అతిసార వ్యాధి, ఇదికలుషితమైన ఆహారం, నీటి ద్వారా సంక్రమిస్తుంది. తీవ్రమైన నీళ్ల విరేచనాలు, తీవ్రమైన వాంతులు, అధిక డీహైడ్రేషన్, కండరాల తిమ్మిర్లు ఈ వ్యాధి లక్షణాలు.

హెపటైటిస్-ఎ/ కామెర్ల జ్వరం : ఇది కూడా కలుషిత ఆహారం, నీటితో వస్తుంది. కామెర్లు ఇందుకు ప్రధాన లక్షణం.

కొన్ని జాగ్రత్తలు పాటిద్దాం

– ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

–వ్యక్తిగత శుభ్రత పాటించాలి. తరచూ చేతులను ▶ 2లో

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమం నిర్మిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సిహెచ్ వినోద్ తెలిపారు. జిల్లాలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఆగస్టు 28న మొదలైన సైకిల్ యాత్ర ఈ నెల 4న ఒంగోలు మహాసభతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సైకిల్ యాత్ర యర్రగొండపాలెం చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటి, మార్కాపురం మెడికల్ కాలేజీ, దర్శి, యర్రగొండపాలెం డిగ్రీ కళాశాలలు ఇంకా నిర్మాణం పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదవాలంటే సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన ధరలకు తగ్గట్టుగా మెస్ చార్జీలను మూడు వేల రూపాయల వరకు పెంచాలని, వార్డెన్, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లకు శాశ్వత భవనాలు కట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను వెంటనే ఆపి కార్పొరేట్ విద్యాసంస్థల అదుపు తప్పిన వ్యవహారాలను నియంత్రించాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకానికి అదనపు నిధులు కేటాయించి మెస్ చార్జీలను పెంచాలని కూడా డిమాండ్ చేశారు. మార్కాపురం, గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఒంగోలులో ప్రభుత్వ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు తప్పనిసరిగా ఏర్పడాలని వినోద్ స్పష్టం చేశారు. యర్రగొండపాలెంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఎస్సీ-1 బాలుర వసతి గృహానికి నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. బాలికల బీసీ వసతి గృహం నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల, బాలుర కాలేజీ హాస్టళ్లను నిర్మించాలన్నారు. క్రీడా వికాస కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ బాలనాగయ్య, మండల కార్యదర్శి ఏడుకొండలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె విజయ్, పాండురంగారావు, దాసు, అరుణ్, ఎఫ్రాయిం, వెంకటేశ్వర్లు, గంగ అంజి కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వినోద్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- ఒకరు మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులు రిమ్స్‌కు తరలింపు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన ఇన్నోవా కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కోమటికుంట గ్రామ సమీపంలోని అనంతపురం టు అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొట్టిపడి గ్రామానికి చెందిన వేల్పుల కొండారెడ్డి(40) శివారెడ్డి, వెంకటరెడ్డి తమ ద్విచక్ర వాహనంపై మార్కాపురం పట్టణం నుంచి స్వగ్రామమైన గొట్టిపడియ గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో సరిగ్గా ప్రమాద స్థలి వద్దకు రాగానే కంభం వైపు నుంచి వేగంగా వస్తున్న ఇన్నోవా కారు కొండారెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనింది. ఈ ప్రమాదంలో వేల్పుల కొండారెడ్డి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరు యువకులు శివారెడ్డి, వెంకట్‌రెడ్డి తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో క్షతగాత్రులైన శివారెడ్డి వెంకట్రెడ్డిలను మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు ఇరువురు యువకుల పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మృతుడు కొండారెడ్డి వృత్తిరీత్యా హైదరాబాదులోని ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కుటుంబంతో సహా అక్కడే స్థిరపడి ఉన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా కుటుంబంతో స్వగ్రామానికి వచ్చారు. ఇంతలోనే మృత్యువు ఇన్నోవా కారు రూపంలో వచ్చి కొండారెడ్డి మృతికి కారణమయ్యింది. ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారుపై ప్రభుత్వ వాహనం, సీఎంవో అని రాసి ఉంది. ప్రమాదం గురించి తెలుసుకున్న కొండారెడ్డి కుటుంబ సభ్యులు మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చేరుకుని మృతదేహం చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు కొండారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ ఎస్ఐ అంకమరావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. కారులో ఎవరైనా ప్రముఖులు ఉన్నారా? లేక ఉన్నత అధికారులు ప్రయాణిస్తున్నారా? అనే అంశంపై గ్రామీణ పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారు ఇదే!

కరాటే పోటీల్లో విజేతలు మార్కాపురం విద్యార్థులు

ప్రజాశక్తి-మార్కాపురం

బెంగళూరులోని కోరమంగల్ ఇండోర్ స్టేడియంలో ఫోర్త్ సౌత్ జోన్ కరాటే టోర్నమెంట్ పోటీలు ఆగస్టు 30, 31 తేదీల్లో జరిగాయి. ఈ పోటీల్లో మార్కాపురంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు మూడు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. విజేతలు ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కె మిల్టన్ శాస్త్రి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. షేక్ షాకీర్‌బాషా 75 కేజీల కుమితే విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. షేక్ ఆసిఫ్ అండర్-9 బాలుర విభాగంలో కాటా గోల్డ్ మెడల్, కుమితేలో సిల్వర్ మెడల్ సాధించాడు. షేక్ యాసిన్ అండర్-12 బాలుర విభాగంలో కాటా గోల్డ్ మెడల్ సాధించాడు. జెకెఎస్‌సి భార్గవ్ అండర్-15 విభాగంలో 50 కె.జి కుమితే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ విషయాన్ని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ తోట ప్రసాద్ ఆదివారం తెలిపారు.

ఒంగోలులో 'సుందరకాండ' సందడి

(మొదటిపేజీ తరువాయి)

ఉత్సాహపరిచారు. ప్రేక్షకులను నచ్చే విధంగా సినిమాలను ఎంపిక చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సుందర కాండ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన వృతి వాఘాని, దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి, చిత్ర నిర్మాత సంతోష్ చిన్నపోళ్ళ, గోరంట్ల మల్లీ ఫెక్స్ యజమానులు గోరంట్ల వీరనారాయణ బాబు, గోరంట్ల ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల విభజనపై..

మంత్రుల కమిటీ ఎటు పోయింది?

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలంలో ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. తాము కర్నూలు జిల్లాలోనే ఉంటామని ప్రకటించారు. ఈ వ్యవహారం పెద్ద రాద్ధాంతంగా మారుతోన్న తరుణంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి స్పందించారు. పవిత్రమైన శ్రీశైలం దేవాలయాన్ని వివాదంలోకి లాగొద్దని కోరారు. మార్కాపురం జిల్లాలో శ్రీశైలం ప్రస్తావనే లేదన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐదు నియోజకవర్గాలతోనే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని, ఆ వ్యవహారాన్ని కమిటీ పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. దీంతో శ్రీశైలంను మార్కాపురం జిల్లాలో కలుపుతారనే ప్రచారానికి తెరపడింది. ఇక పశ్చిమ ప్రాంతానికి మొన్న వెళ్లిన మంత్రులు కూడా కొద్ది నెలల్లోనే మార్కాపురం జిల్లా ఏర్పాటవుతోందని వెల్లడించారు. అయితే 14 నెలలుగా ఇదే చెబుతున్నారనే చర్చ కూడా లేకపోలేదు. ఎందుకంటే తెలుగుదేశం నేతలు ఎన్నికలకు ముందు స్పష్టంగా హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు, ప్రకాశం జిల్లాలో కలిపే నియోజకవర్గాలపైనా స్పష్టత ఉంది. కొన్ని మండలాలను మార్పులు చేర్పులు చేయాలని కోరుతున్నారు.ఒంగోలుకు దగ్గరలో ఉన్న ముండ్లమూరు, తాళ్లూరు మండలాలను ప్రకాశంలోనే ఉంచాలనే డిమాండ్ వచ్చింది. దీనిపై అన్నిపార్టీల్లోనూ సాను కూలంగానే ఆలోచన ఉంది.ఏదేమైనా ప్రకాశం జిల్లాలో ఐదు నియోజకవర్గాలు, మార్కాపురంలో ఐదు నియోజకవర్గాలు ఉండాలనే ఆలోచన స్పష్టంగా ఉంది. మండలాలను మార్పులు చేర్పులు చేయాల్సి వస్తే ఆలోచించాలి. ప్రభుత్వం జిల్లాల ఏర్పాటుపై వెంటనే నిర్ణయం తీసుకునే పరిస్థితిలో లేకనే కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఎన్నికలముందు ఏహామీ ఇచ్చారో దానిపై అప్పట్లో కూటమి నేతలకు స్పష్టత లేకనా? మరేమైనా కారణాలు ఉన్నాయా?అనేదీ ఆలోచించాలి. జిల్లాల పునర్విభజనపై వీలైనంత త్వరగా నిర్ణయంతీసుకోకుంటే తెరపైకి అనేకం వచ్చే అవకాశం లేకపోలేదు. సిఎం చంద్రబాబు దీనిపై ముందుకు పోయేలా కనిపించనందున ఇక్కడ పాలకపక్ష నేతలు కూడా దీనిపై సమాధానం చెప్పలేక కొంత ఇబ్బంది పడుతూనే ఉన్నారు. మంత్రుల కమిటీ రాక ఎప్పుడా అని పార్టీలు, ప్రజా సంఘాలు ఎదురు చూస్తున్నాయి.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

(మొదటిపేజీ తరువాయి)

సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

- కలుషితమైన ఆహారం, నీరు తీసుకోకుండా జాగ్రత్త పడాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం ఉత్తమం.
- దోమల కుట్టకుండా దోమతెరలు, రిపెల్లెంట్లు వినియోగించుకోవాలి.
- జలుబు, ఫ్లూ వంటి శ్వాసకోశ వ్యాధుల నివారణకు మాస్కు ధరించాలి.
- జ్వరం, దగ్గు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు
- డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డిఎం,హెచ్ఒ

జిల్లాలో సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ఒంగోలు జిజిహెచ్‌లో వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తలు పాటించాలి
డాక్టర్ సానల ధీరజ్ బాబు
జనరల్, ఫ్యామిలీ ఫిజీషియన్
శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

వర్షాకాలంలో చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలి. వీరిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం ఇందుకు కారణం. డెంగీ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. అతిసారను విస్మరిస్తే ప్రాణాంతకం కావచ్చు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరం కావచ్చు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 73/2025
దొడ్డి విజయలక్ష్మి ..వాది
వర్సస్
గుమ్ముళ్ల వెంకట రంగయ్య ..ప్రతివాది
To
ప్రతివాది చిరునామా
గుమ్ముళ్ల వెంకట రంగయ్య తండ్రి రంగయ్య, హిందూ, ఉద్యోగి, వయస్సు సుమారు 60 సం.లు, హౌస్ నెం ఎ-17-28/5ఎ1 ఎదురుగా,2వ లైను, వెంకటేశ్వర కాలనీ,ఆర్టిసి బస్టాండ్ దగ్గర, గిద్దలూరు గ్రామము, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా, పనిచేయుచున్నది: ఆరోగ్య విభాగంలో సూపర్వైజర్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కొమరోలు గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబర్ దావాలోని వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు దావాను దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు 01-09-2025 వ తేదీ వాయిదా వున్నది. కావున మీరు వాయిదా రోజు ఉదయం గం. 10:30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది.లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.
// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
శ్రీ పి.యన్.శేషశయనా రెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
అడ్వకేట్స్, గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P No : 54/2023
IN
O.S No :226/2022
జాజం వెంకట రమణ .. డి.హెచ్.ఆర్
వర్సస్
1.అయ్యపురాజు నాగాదుర్గ వీరాంజనేయులు చనిపోయారు అతని 2వ తరగతి చట్టపరమైన వారసులు
2.అయ్యపు రాజు రాజేంద్ర కుమార్ ..జే.డీ.ఆర్
వేలం ప్రకటన
పై నెంబరు అమలు అర్జీలో షెడ్యూలు స్థిరాస్థిని శ్రీ కోర్టువారు 25-09-2025వ తేదీన ఉదయం 10:30 గంటలలగాయతు వేలం వేయుదురు. వేలంలో సవాలుదార్లు పాలుగొనవచ్చును.
షెడ్యూలు
షెడ్యూల్ ఆస్తి కొమరోలు గ్రామం, కొమరోలు మండలం, గిద్దలూరు సబ్-రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రేషన్ మార్కాపూర్, ప్రకాశం జిల్లాలో ఉంది.
స్థిరాస్థి వివరము
సర్వే నెం 656/1, విస్తీర్ణం ఎ 0.36 సెంట్లు
హద్దులు
తూర్పు - మానుకోండు బాబు స్థలం
పడమర - వెంగయ్య చౌదరి స్థలం
ఉత్తరం - పొట్టి సుబ్బయ్య స్థలం
దక్షిణం - ఉమ్మడి సుబ్బయ్య స్థలం
పిటిషన్ లో కనబరచిన మార్కెట్ విలువ/-
డిహెచ్ఆర్ విలువ రూ 3,00,000-00
అమీనా విలువ రూ 4,00,000-00
మార్కెట్ విలువ రూ 1,80,000-00
// కోర్టు వారి అనుమతిన //
తేదీ: 31-08-2025
స్థలం : గిద్దలూరు
ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ భాషా,
డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేట్,
గిద్దలూరు

మృత్యుకుహరాలు.. గ్రానైట్ గనులు

ప్రాణభయంతో పనిచేస్తున్న కార్మికులు

పేకమేడల్లా గ్రానైట్ హైవాల్స్

చుట్టపు చూపుగా అధికారుల తనిఖీ

మైనింగ్ కార్యాలయం హైదరాబాదులో..

యాజమాన్యాల నిర్లక్ష్యంతో ప్రమాదాలు

గ్రానైట్ గని లోపలి దృశ్యం

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ గనులు మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. వందలాది అడుగుల లోతుకి వెళ్ళిన గ్రానైట్ గనులలో దినదిన గండం నూరేళ్ళ ఆయుషు అన్న చందంగా కార్మికులు నిత్యం ప్రాణభయంతో పనిచేస్తున్నారు. ఎప్పుడు ఏ రాయి పైనుంచి పడుతుందో, ఏ మట్టి కుప్పలు తమను కప్పెడతాయోనని నిత్యం భయం భయంగా కార్మికులు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలకనుగుణంగా క్వారీయంగ్ చేస్తున్నారా లేదా నిఘా పెట్టాల్సిన మైనింగ్ అధికారులు నెలనెలా అందుతున్న ముడుపులను మూటగట్టుకోవటంలోనే నిమగ్నం అవుతున్నారు. పర్యవసానంగా కార్మికులు తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవాల్సి వస్తుంది.

చీమకుర్తి ప్రాంతంలో దాదాపు 42 గెలాక్సీ గ్రానైట్ కంపెనీలు మైనింగ్ చేస్తున్నాయి. యజమానులు వారి లాభాలే కానీ, కార్మికుల కష్టాలు, భద్రత గాలికి వదిలేస్తున్నారు. గనిలో ఉన్నప్పుడు కార్మికులకు ఇవ్వాల్సిన భద్రతా సామాగ్రి ఇవ్వకపోవడం, నిబంధనల అనుగుణంగా క్వారీలు నిర్వహించకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గనులు దాదాపు 500 నుంచి 600 అడుగుల వరకు లోతుకు వెళ్లాయి. మైనింగ్ నిబంధనల ప్రకారం అనుమతులు ఇవ్వకపోవడం వల్ల యజమానులు ఇష్టారాజ్యంగా క్వారీయింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో హైవాల్సు పెరిగాయి. హైవాల్సుపై వేర్పడిన జాయింట్లు మరియు మెతకదనం వలన పగుళ్లు ఏర్పడి, వర్షాకాలంలో తడిసి హైవాల్సు కిందికి జారి పడుతున్నాయి. దీనివలన కింద గనిలో పనిచేస్తున్న కార్మికులు తమ విలువైన ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుంది.

గనుల్లో జరిగిన ప్రమాదాలు..

– 2010 ఫిబ్రవరిలో హంస మినరల్స్ గనిలో హైవాల్సి కూలి 14 మంది కార్మికులు సమాధి అయ్యారు.

– ఇటీవల మిడ్ వెస్ట్ మరియు కృష్ణ సాయి గ్రానైట్స్‌లో కూడా హైవాల్స్ జారిపటంతో మిషనరీలు ధ్వంసం అయ్యాయి. సమయానికి కార్మికులు లేకపోవటంతో ప్రాణానష్టం జరగలేదు.

– జయ మినరల్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగికి బ్లాస్టింగ్ సమయంలో ఎగురొచ్చిన రాయి చేయికి తగలడంతో చెయ్యి తెగిపోయింది.

– సూర్య గ్రానైట్ గనిలో ర్యాంపుపై నుంచి డంపర్ బోల్తో పట్టడంతో డ్రైవర్ చనిపోయిన సంఘటన జరిగింది.

– రెండేళ్ల క్రితం మిడ్ వేస్ట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు, పల్లవ గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో వైర్స ఆపరేటర్ మృతి చెందారు.

– గత నెలలో బల్లికురవలో ఓ గనిలో హైవాల్స్ జారి పడటంతో ముగ్గురు కార్మికులు మృతి చెందారు.

– గత శుక్రవారం రాత్రి మిడ్‌వెస్ట్ గనిలో హైవాల్స్ జారి పడ్డాయి. గనిలో కార్మికులు లేకపోవటంతో ప్రమాదం తప్పింది.

ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సేఫ్టీ అధికారులు సందర్శించకపోవడం విశేషం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చీమకుర్తి, బల్లికురవ, గురిజేపల్లి ప్రాంతాలలో విస్తృతంగా గ్రానైట్ గనులు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి నెల నెల వేలాది క్యూబిక్ మీటర్ల ముడి రాయి వెలికి తీస్తున్నారు. లక్షలాదిమంది జిల్లాలో గ్రానైట్ గనులపై ఆధారపడి జీవిస్తున్నారు. నిత్యం గనులలో పర్యవేక్షణ నిర్వహించాల్సిన మైనింగ్ అధికారులు మాత్రం జిల్లాలో ఉండటం లేదు. మైనింగ్ డిడిఎంఎస్ కార్యాలయం గతంలో నెల్లూరులో ఉండేది. దానిని గత రెండేళ్ల క్రితం హైదరాబాదుకు మార్చారు. దీంతో ప్రమాదాలు జరిగిన తక్షణం స్పందించే అధికారులు కరువయ్యారు. ఇప్పటికైనా పెరిగిపోయిన హైవాల్స్‌ను తొలగించి, నిబంధనలకు అనుగుణంగా క్వారింగ్ జరిగేలా అధికారులు తక్షణం చర్యలు తీసుకోకపోతే మరో హంస గ్రానైట్ దుర్ఘటనలు పునరావతం అయ్యే అవకాశం ఉంది.

ప్రమాదాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి: సిఐటియు

గ్రానైట్ క్వారీలలో ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. క్వారీ యాజమాన్యాలు నిబంధనలను పాటించకపోవడం వలన ప్రమాదాలు నిత్యం సంభవిస్తున్నాయని, మైనింగ్ అధికారుల నిరంతర పర్యవేక్షణ లోపం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మైనింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేసే విధంగా మైనింగ్ కార్యాలయం ఒంగోలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అడవిని తలపిస్తున్న చెరువు

చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా కోవిలంపాడు చెరువు - అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

మట్టి తోలుకుపోయిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణదారులు

చెరువులో మట్టిని తరలిస్తున్న దృశ్యం

చెరువు కట్టపై ఏపుగా పెరిగి ఉన్న చిల్లచెట్లు

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

మండల పరిధిలోని కోవిలంపాడు చెరువు అభివృద్ధి గురించి అధికారులు పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కోవిలంపాడు చెరువుకు నీరు చేరలేదు. దీంతో చిల్లచెట్లు ఏపుగా పెరిగి చెరువు అడవిని తలపిస్తోంది. ఈ క్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేరోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లు చెరువులోని మట్టిని తోలుకునేందుకు అవకాశం ఇస్తే చెరువును అభివృద్ధి చేస్తామంటూ గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు, రైతులు చెరువు అభివృద్ధి చెందుతుందని ఆశపడి మట్టి తోలుకొనేందుకు అంగీకారం తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి చెరువులోని మట్టిని తరలించారు. చెరువు అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దీనిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో సూపర్‌వైజరుగా పనిచేస్తూ గ్రామంలోని పలువురు నాయకులతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని మట్టిని తరలించి సొమ్ము చేసుకొని, చెరువు అభివృద్ధి గురించి పట్టించు కోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సైతం రోడ్డు నిర్మాణదారుడితో లాలూచీపడి వారికి వత్తాసు పలుకుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఆనందం

టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

మాట్లాడుతున్న డాక్టర్ నూకసాని బాలాజీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నంత ఆనందం ఏ వృత్తిలోనూ లేదని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామంలో ఉన్న కాకతీయ కళ్యాణ మండపంలో ఆదివారం నాడు ఉపాధ్యాయురాలు మక్కే యశోద ఉద్యోగ విరమణ సందర్భంగా సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వాళ్లంతా చాలా ప్రశాంతమైన జీవితంలో ఉన్నారని, ఈ రోజుల్లో ఎవరూ ఏ స్థాయిలో ఉన్న వాళ్లంతా ఉపాధ్యాయుల వద్ద నుంచి వెళ్లిన వారేనన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చే విధంగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. తల్లికి వందనం పేరుతో పాఠశాలలో చదువుతున్న అందరికీ డబ్బులు అందించిన ఘనత ఈ కూటమి ప్రభుత్వందే అన్నారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలన్న లక్ష్యంతో విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఎన్నో మార్పులు విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి అందరూ అభిమానం పొందాలన్నారు. ఉపాధ్యాయులకు ఏమైనా సమస్యలు వస్తే ఆ ఉపాధ్యాయుడికి అందరూ అండగా ఉండాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు మక్కే యశోదాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కత్తి శ్రీనివాసరావు ఆవుల శ్రీనివాసరావు తలారి సుబ్బారావు అర్రెబోయిన రాంబాబు నూకసాని వెంకటేశ్వర్లు, కీర్తి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జెండాలు పట్టుకొని హల్‌చల్ చేస్తున్న యువకులు

నిమజ్జనంలో యువకుల ఘర్షణ

చెదరగొట్టిన పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ : శింగరాయకొండ పాకల బీచ్‌లో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. జరుగుమల్లి మండలానికి చెందిన కొంతమంది యువకులు టీడీపీ జెండాలు పట్టుకొన వున్నారు. అదే సమయంలో కొండేపి మండలానికి చెందిన కొందరు వైసీపీ జెండాలతో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలు ఎదురు పడటంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలు గొడవ పడుతుండగా పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఎంతకూ వినకపోవడంతో లాఠీలతో ఇరు వర్గాలను చెదరకొట్టి అక్కడి నుంచి తరిమారు.

వేలంలో రూ.51,116 పలికిన లడ్డూ

లడ్డూతో సాయిపవన్

ప్రజాశక్తి-చీమకుర్తి : స్థానిక గాంధీ నగర్ రెండో లైన్లో ఏర్పాటు చేసిన వినాయక లడ్డు వేలంపాటలో సూది సాయి పవన్ రూ.51,116లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాటి రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సూది వెంకటరావు, వైసిపి నాయకులు సూది శ్రీకాంత్, మొగిలి శెట్టి వెంకటేశ్వర్లు, సూది సునీల్, పత్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మారం వెంకారెడ్డి

బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి : స్థానిక కె.వి పాలెం రోడ్డులోని రామచంద్ర మిషన్ సమీపంలో ఎమ్మెస్సార్ నగర్ పేరుతో ఏర్పాటు చేయనున్న డిటిసిపి అప్రూవ్డ్ లేఔట్ బ్రోచర్లను మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్, ఎంవిఆర్ గ్రూప్ సంస్థల అధినేత మారం వెంకారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 100 శాతం క్లియర్ టైటిల్‌తో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని అనుమతులు తీసుకొని చీమకుర్తిలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేస్తున్న డిటిసిపి అప్రూవ్డ్ లేఅవుట్‌గా ఆయన పేర్కొన్నారు. లేఅవుట్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, తక్కువ ధరకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి సుధీర్‌రెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, అవిసినేని వెంకన్న రౌతు సుబ్బారావు ఆల పాటి నరసింహారావు, పుల్కం కోటిరెడ్డి, పేరం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-దర్శి : దర్శి పిటిఎస్ కళ్యాణ మండపంలో సాయి చంద్రిక మొబైల్స్ వారి 7వ యూనియన్ బైక్ లక్కీ డ్రాలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, దర్శి వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఇతర దేవదానం, నాయకులు కొల్లా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కొత్తపట్నం : కొత్తపట్నం మండల కేంద్రంలోని 132/33 కెవి నూతన లైన్లు నిర్మాణం కారణంగా నేడు, రేపు ఈతముక్కల, మడనూరు, రాజుపాలెం వ్యవసాయ రైతులకు ఉదయం 6 నుంచి 9 వరకు, రాత్రి 10 నుంచి 12 వరకు విద్యుత్తు ఇవ్వబడుతుందని, మడనూరు, తేటపురం ఆక్వా రైతులకు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.చంద్రకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

సహాయనిధి చెక్కుల అందజేస్తున్న ఆనందబాబు

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గానికి చెందిన సుమారు 11 మందికి సిఎం సహాయ నిధి చెక్కులు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా ఆదివారం అందజేశారు. వేమూరు మండలం చిలుమూరుకు చెందిన కొడాలి వెంకట రాఘవయ్యకు రూ.1,29,971, గాజుల కృష్ణ కుమారికి రూ.32,787, రామ కోటేశ్వరరావుకు రూ.20,524, పోతుమర్రు గ్రామానికి చెందిన పులివర్తి విజయకాంత్‌కు రూ.1,56,652 , కీర్తి సాయి కుమారికి రూ.20,524, పెరవలి గ్రామానికి చెందిన శ్రీరామ కుమారికి రూ.90వేలు, చెన్నుపల్లి రాజేష్‌కు రూ.31,346, పెరవలిపాలెం గ్రామానికి చెందిన గడ్డం సాంబశివరావుకు రూ.70వేలు, ఉసా దేవికకు రూ.25,656, కాకర్లమూడి గ్రామానికి చెందిన బొల్లిముంత అంకమ్మరావుకు రూ.47, 016, చావాలి గ్రామానికి చెందిన బెల్లంకొండ తిరుపతిరావుకు రూ.55వేలు చొప్పున రూ.6,79,476 అందజేశారు.

మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఉన్నత పాఠశాలకు గణిత ఉపాధ్యాయురాలు, పాఠశాల పూర్వ విద్యార్థిని నగరాజకుమారి రూ.15 వేల విలువైన మొక్కలు, రూ.15 వేల విలువైన బీరువా ఆదివారం బహూకరించారు. ముద్దన హనుమయ్య జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేసి బదిలీపై యనమదల యుపి పాఠశాలకు వెళ్ళిన ఆమె తాను పనిచేసిన పాఠశాలకు కడియం నర్సరీ నుండి మొక్కలు, పాఠశాల రికార్డులు బధ్రపర్చడం కోసం బీరువ బహూకరించారు. ఆమె దంపతులను సన్మానించారు. ఎంఇఒలు పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిలుకూరి గోపి, హెచ్‌ఎం ఎం దేవేంద్రరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఇన్‌చార్జి ఎంపీడీఓగా కార్యాలయంలో ఎఓగా పని చేస్తున్న కంభంపాటి నాగసీతా రాంబాబుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్‌పి కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓగా పనిచేస్తున్న వై శ్రీనివాసరావును బాపట్లలో అక్టోబర్ 2వరకు జరగనున్న ఫౌండేషన్ ట్రైనింగ్‌కు హాజరవుతున్నందున రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంపిడిఒ రాంబాబు

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

ప్రజాశక్తి - పంగులూరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పంగులూరు రానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని, అనంతరం 11 గంటలకు స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేస్తారని తెలిపారు. నియోజక వర్గంలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు సిఎస్ఆర్ నిధులతో ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేస్తున్న కార్యక్రమంలో భాగంగా పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సౌకిళ అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జివి. కొండారెడ్డి

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక, కర్షక ఉద్యమాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జివి కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన సిపిఎం కార్యకర్తల శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో 300 కోట్ల మంది ఉంటే, సోషలిస్ట్ ఆర్థిక వ్యవస్థలో 150 కోట్ల మంది ఉన్నారని అన్నారు. ప్రస్తుతం పెట్టుబడి దారి ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంక్షోభం నుండి బయట పడేందుకే దేశాల మధ్య యుద్ధాలు సృష్టిస్తున్నారని అన్నారు. అమెరికా ఆయుధాలు అమ్ముకొని బలపడాలని ప్రయత్నిస్తుందని అన్నారు. ఇందులో భాగమే రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధాలని చెప్పారు. దేశంలో బిజెపి అమెరికా సామ్రాజ్యవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రధాని విదేశీ పర్యటనలన్నీ స్వదేశీ మార్కెట్‌ను కొల్ల కొట్టడానికేనని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నాయని అన్నారు. రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వేలాది ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పుచెబుతున్నారని అన్నారు. ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదని అన్నారు. రాష్ట్రంలోని అధికార పార్టీల నేతలు కేసుల నుండి బయపడేదుకు మత విద్వేషాలకు బానిసలు అవుతున్నారని అన్నారు. ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. సిపిఎం నాయకులు సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ రాబోయే కాలమంతా పోరాటాలమయం కావాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు, సిపిఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఛాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి - బాపట్ల

ఏపి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో జరిగిన అండర్ 17 ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో బాపట్ల క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి కె పాల్ కుమార్ తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఖేలో ఇండియా సెంటర్‌లో ఫెన్సింగ్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు భీమవరం వెస్ట్ బెర్రీ హై స్కూల్లో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వ్యక్తిగత విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారని తెలిపారు. ఎస్ కిరణ్‌శ్వరరెడ్డి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గ్రూప్ విభాగం ఫోయిల్‌లో ఎ కార్తీక మిత్ర గోల్డ్ మెడల్, ఎం కార్తికేయ రజత పతకం, సబ్రే విభాగంలో కె హర్షిత, వై సలోమి రజత పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ జిల్లా ఆఫీసర్ కె పాల్ కుమార్, ఫెన్సింగ్ కోచ్ ఆర్ నాగ చిరంజీవి క్రీడాకారులను అభినందించారు.

చెరుకుపల్లి: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ (కత్తి సాము) పోటీల్లో జై హనుమాన్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఏపి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో ఈ నెల 30న జరిగిన అండర్ 17 ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో పథకాలు సాధించారు. గ్రూపు విభాగం ఫోయిల్‌లో మొదటి స్థానంలో హీరజ్ సాయి గోల్డ్ మెడల్ సాధించారు. ఈపీఈఈ విభాగంలో మూడో స్థానంలో బర్మా భవ్య శ్రీ, మొఖమాటం జ్యోతిర్మయి బ్రాంజ్ మెడల్ సాధించారు. విజేతలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె పవన్ కుమార్, జై హనుమాన్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ ఎస్ నాంచారయ్య అభినందించారు.

కత్తి సాము పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మురళీమోహన్‌కు పురస్కారం

ప్రజాశక్తి - బట్టిప్రోలు

పల్నాడు జిల్లా నరసరావుపేటలో భువన చంద్ర టౌన్ హాల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ సంబరాల సందర్భంగా మండలంలోని వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్‌కు తెలుగు తేజం పుష్కరం శ్రీశ్రీ కళా వేదిక మేనేజింగ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం చేతుల మీదగా అందుకున్నారు. తెలుగు భాష వైభవం, తెలుగు సాంగ్స్, సాంప్రదాయాల అభివృద్ధికి వివిధ రంగాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు అందజేస్తున్నట్లు డైరెక్టర్ కత్తి మండ ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో రామారావు, హరిప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మురళీమోహన్రావు సత్కరిస్తున్న దృశ్యం

పొగాకు రైతులు తరలి రావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

బర్లి పొగాకు రైతు ఎదుర్కొంటున్న సమస్యల పై రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసనకు పొగాకు రైతులు, కౌలు రైతులు తరలి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో ఆది వారం జరిగిన సిపిఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు రైతు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ కార్యాలయానికి తరలిరావాలని కోరారు. పొగాకు అమ్ము కంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యల పై వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. నాణ్యత లేదనే సాకుతో ఎక్కువ పొగాకు బేళ్లను తిరస్కరిస్తున్నారని అన్నారు. దీంతో ధరలో భారీగా కోత పెడుతున్నారని అన్నారు. ఇటీవల అడుసుమిల్లికి చెందిన ఒక రైతు 30 చెక్కులను తీసుకొస్తే 22 చెక్కులు తిరస్కరించారని అన్నారు. పంగులూరు మండలం రైతులు 70 కిలోమీటర్లు ప్రయాణం చేసి పొదిలి దగ్గరికి తీసుకెళ్తే అక్కడ కూడా పొగాకు బేళ్లకు గణనీయంగా రేటు తగ్గించేశారని అన్నారు. వెనక్కి తీసుకురావడానికి రైతులు ఎంతో ఖర్చులు భరించాల్సి వచ్చిందని అన్నారు. నాణ్యత పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తిరస్కరించిన చెక్కులను గ్రేడ్ చేయించి తీసుకరమ్మని చెప్పే పరిస్థితి కూడా లేదని అన్నారు. పొగాకు నాణ్యతకు సంబంధించి మార్క్‌ఫెడ్ నిబంధనలు సడలించాలని కోరారు. అధిక శాతం పొగాకు చెక్కులకు రు.6వేలు, రు.9వేలు మాత్రమే ధర నిర్ణయిస్తున్నారని అన్నారు. రూ.12 వేలకు తక్కువ చేసి అతి తక్కువ ధర ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. కొనుగోళ్లు మొదలు పెట్టి మూడు నెలలైనప్పటికీ రైతుల నుండి కొనుగోలు చేసిన పొగాకుకు డబ్బులు చెల్లించ లేదన్నారు. కొనుగోలు చేసిన 8గంటల్లోనే రైతుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు నెలలైనా అతీగతీ లేదన్నారు. పొగాకు కొనుగోళ్లకు రూ.274 కోట్లు కేటాయించామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు పొగాకు తాలూకు డబ్బు రైతులకు ఎందుకు చెల్లించలేదని అన్నారు. దీంతో కౌలు రైతులు అప్పులకు వడ్డీలు పెరిగిపోయి, అవి చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మళ్లీ వ్యవసాయం సాగు చేసేందుకు పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

విలువలతో విద్యాబోధన

ప్రజాశక్తి - సంతమాగులూరు

గింజపల్లి వెంకటేశ్వర్లు

సమాజం పట్ల ప్రేమ, సామాజిక రుగ్మతల పట్ల వ్యతిరేకత, ఉత్తమ సమాజాన్ని నిర్మించాలన్న తపన వంటి లక్షణాలే ఉపాధ్యాయ వృత్తికి సోపానాలని వెల్లల చెరువు జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గింజపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆగస్టు 31న ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. రేపటి సమాజానికి నేటి తరగతుల్లోనే బలమైన పునాది వేస్తుందన్న మేధావుల మాటలను విశ్వసిస్తానని అన్నారు. ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలు తరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సంబంధాలకే అధిక విలువ ఇస్తున్నారని అన్నారు. ఇది ప్రమాదకర ధోరణి అన్నారు. పిల్లలు, తల్లిదండ్రులకు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్య ఉండే సంబంధాలు, ఉపాధ్యాయులు, తల్లి, దండ్రులకు మధ్య ఉండే సంబంధాలు యాంత్రికంగా మారుతున్నాయని అన్నారు. ఉపాధ్యాయ విలువలు ఉద్యోగ జీవితంలో కొద్దిమేరకైన ఆచరిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. 39ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఉపాధ్యాయ వృత్తి సంతృప్తిగానే సాగిందన్నారు. 1986లో స్పెషల్ టీచర్‌గా ప్రాథమిక పాఠశాల్లో ప్రారంభమైన ఉద్యోగం రెగ్యులర్ సెకండ్ గ్రేడ్ టీచర్‌గా, స్కూల్ అసిస్టెంట్‌గా, ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ ఉన్నతితో ఉద్యోగ విరమణ చేయటం ఆనందంగా ఉందన్నారు. 1986 నుండి 2005 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తే 2005 నుండి 2025 వరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బాధ్యతలు నిర్వహించానన్నారు. వ్యవసాయం, పశు పోషణ ప్రధాన వృత్తిగా ఉన్న సాధారణ కుటుంబం నుండే తన ఎదుగుదల ప్రారంభమైందని తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. చదువు ప్రాధాన్యత గుర్తించి తమ తల్లి, దండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు స్వగ్రామం సంకురాత్రిపాడులో 1950లో స్కూలు ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. ఆ నేపథ్యంలోనే తమ అన్నదమ్ములు ముగ్గురం చదువుకు దగ్గరై ఉన్నత ఉద్యోగాలు పొందే అవకాశం వచ్చిందన్నారు. గత దశాబ్ద కాలంగా విద్యా రంగంలో వినూత్నమైన మార్పులు వచ్చాయని అన్నారు. మాతృభాష విద్యార్థులకు దూరం అవ్వడం, ప్రభుత్వాలు బోధనతో కూడిన అంశాల కంటే బోధనేతర పనులకు అధిక ప్రాధాన్య ఇవ్వడం ద్వారా ఉపాధ్యాయుడు తన వృత్తి పట్ల సంతృప్తిగా లేరన్నారు. విద్యార్థుల్లో శారీరకంగా, మానసికంగా సవాళ్లను ఎదుర్కొని అధికమించే స్థితిని, సంయమనాన్ని కోల్పోతున్నారని అన్నారు. వాటిని పెంచేందుకు తల్లి, దండ్రులు, ఉపాధ్యాయులు ఉమ్మడిగా బాధ్యత తీసుకోవాల్సి ఉందన్నారు. తన దగ్గర చదువుకున్న విద్యార్థుల్లో కొంత మంది ఇతర దేశాల్లో ఉన్నత ఉద్యోగాలు, వృత్తుల్లో కొనసాగుతున్నారని, డాక్టర్లు, ఇంజనీర్లు, మేధావులుగా రాణిస్తున్నారని అన్నారు. వారిని చూసినపుడు ఉపాధ్యాయునిగా విజయం సాధించాననే సంతృప్తి కలుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

పాఠశాల విద్యను ప్రయోగ క్షేత్రంగా మార్చిన ప్రభుత్వం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి పాఠశాల వ్యవస్థను ప్రయోగ కేంద్రంగా మార్చిందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఒంగోలు టీటీడీ కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల రంగంలో ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో నిమగ్నం చేస్తూ పేద బడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. సెల్ఫ్ అసెస్మెంట్ పేరుతో అధిక భారం గల మూల్యాంక విధానం,ప్లాంటేషన్, మెగా పిటిఎం, యోగా లీడర్‌షిప్ ట్రైనింగ్ లాంటి పనులతో పాఠశాల విద్యా బోధనకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక అంశాలపై కూడా ఆయన తీవ్రంగా స్పందించారు. 12వ పిఆర్‌సి ప్రకటనను తీవ్ర నిర్లక్ష్యం చేయడం, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు11వ పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు, సిపిఎస్ నిధులు కలిపి మొత్తం సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రోడ్‌మ్యాప్ ప్రకటించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎస్. రవి, సహాధ్యక్షులు ఐవి. రామిరెడ్డి, జి. ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్. చిన్నస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్యదర్శులు, మండల శాఖల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యే దామచర్ల దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వినాయక చవితి సందర్భంగా ఒంగోలు టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఆయన సతీమణి దామచర్ల నాగసత్యలత ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా కోలాట బృందం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పందిళ్ళకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రాయితీ కల్పించిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ఒంగోలు నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మేళ తాళాలతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, ఎమ్మెల్యే దామచర్ల కుమార్తెలు అనీషా లక్ష్మి, తనూజ లక్ష్మి, టిడిపి నగర అధ్యక్షులు బండారు మదన్, ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, మాజీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, మేడికొండ మోహనరావు, గుంటూరు రాంబాబు, మహిళా నాయకురాళ్ళు రావుల పద్మజ, బీరం అరుణ, ఆర్ల వెంకటరత్నం, టి.అనంతమ్మ, యు.నాగేంద్రమ్మ, కె.కుసుమ కుమారి, నిడమానూరి పావని, పెద్దిశెట్టి వరలక్ష్మి, పసుపులేటి సునీత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ దంపతులు

తీరంలో 'నిమజ్జనాల' సందడి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో ఆదివారం సందడి నెలకొంది. నిమజ్జన కోసం వినాయక విగ్రహాలతో ప్రజలు భారీగా తరలివచ్చారు. కందుకూరు, శింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు, కొండపి, పొన్నలూరు ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు లారీలు ఆటోలపై వినాయక చవితి విగ్రహాలతో తరలివచ్చారు. 170 విగ్రహాలను నిమజ్జనం చేశారు. సిఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్ర, జరుగుమల్లి ఎస్ఐ బి.మహేంద్ర, రామాయపట్నం మెరైన్ సిఐ శివన్నారాయణ, ఎస్ఐ ఎస్‌కె.షరీఫ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు మైకుల ద్వారా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ బేవాచ్ టవర్ నుంచి హెచ్చరికలు జారీ చేశారు.

కొత్తపట్నం : వినాయక విగ్రహాల నిమజ్జనంతో కొత్తపట్నం వద్ద తీరంలో సందడి నెలకొంది. ఆదివారం 300 విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. ఒంగోలు డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టూటౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు సారథ్యంలో కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్‌తో పాటు మరో నలుగురు ఎస్ఐలు, 60 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది మహిళా పోలీసులు, పది మంది మెరైన్ సిబ్బంది. పదిమంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసు సిబ్బంది

కొత్తపట్నంలో నిమజ్జనానికి తీసుకొచ్చిన విగ్రహం

నిమజ్జనం కోసం తీసుకొచ్చిన వినాయకుడి విగ్రహాలు

వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న ప్రజలు

నేటి నుంచి 30 పోలీసు యాక్ట్

ప్రజాశక్తి- ఒంగోలుసబర్బన్

శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో సోమవారం నుంచి ఈనెల 30 వరకూ 30 పోలీస్ యాక్ట్ అమలులో చేస్తున్నట్లు ఒంగోలు డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ప్రజా సంఘాలు, కార్మిక యూనియన్లు, రాజకీయ పార్టీలు మరియు ఇతర సంస్థలు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ధర్నాలు నిర్వహించరాదని తెలిపారు. ఏదైనా కార్యాచరణ నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామనిఆయన పేర్కొన్నారు.

ఎస్ఐకు సిఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

జిల్లా పోలీస్ శాఖలో వేలిముద్రల విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.శరత్ బాబుకు సిఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా శరత్ బాబు క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి దామోదర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిఐగా ఉద్యోగోన్నతి పొందడం బాధ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. పోలీస్ శాఖకు గౌరవం, ప్రతిష్ట పెరిగేలా విధి నిర్వహణలో ఎలాంటి రిమార్క్స్ లేకుండా బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఉన్నతాధికారుల మన్ననలు అందుకోవాలని సూచించారు.

ఎపిహెచ్ఎంఎ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం. శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో శ్రీనివాసరావు ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. శ్రీనివాసరావు ప్రస్తుతం డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు (డిసిఇబి) సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ఎంపీ మాగుంట ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వినాయక చవితి సందర్భంగా ఒంగోలు నగరంలోని పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భ:గా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత ఒంగోలు రాం నగర్ 2వ లైన్‌లో అంజిరెడ్డి మిత్ర బందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ఎంపీ మాగుంట పాల్గొన్నారు. అదేవిధంగా రాజధాని సెంటర్ రాజమాతా టవర్స్‌లో రాజమాత సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. రాజపానగల్ రోడ్డులోని 4వ అడ్డరోడ్లులో తూము సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లోని దండే సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక కోర్ట్ సెంటర్ మాతా శిశు వైద్యశాల ఎదురు కార్పొరేటర్ తిప్పరమల్లి రవితేజ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. స్థానిక గాంధీ రోడ్డు ఇందిరా గాంధీ బొమ్మ దగ్గర గోల్డ్ అండ్ సిల్వర్ వర్కర్స్ అసోసియేషన్ నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ఎంపి మాగుంట హాజరయ్యారు. తరువాత ఒంగోలు పత్తివారి వీధిలో విఘ్నేశ్వర బాల భక్త సమాజం కమిటీ నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ఎంపీ మాగుంట పాల్గొని ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.రవితేజ, తాతా ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు గ్రేడింగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాణ్యమైన పొగాకు తీసుకురావాలి

ప్రజాశక్తి - పర్చూరు

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొగాకు కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన పొగాకు తీసుకురావాలని అడిషనల్ కలెక్టర్ లవన్న సూచించారు. స్థానిక రోటరీ భవన్లో పొగాకు గ్రేడింగ్ విధానంపై వ్యవసాయ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అసలు నాణ్యతలేని పొగాకు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావడం వల్ల ఎక్కువ పొగాకు చెక్కులు కొనుగోలు జరగకుండా తిరిగి వెనక్కి పంపవలసి వస్తుందని అన్నారు. ఇలా వెనక్కి పంపించడం వలన రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతులు నాణ్యమైన పొగాకు మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే రైతులు పండు ఆకు, పచ్చుగుల్లాకు, బోగులు ఆకు, పనికిరాని ఆకు, బూజు పట్టిన ఆకు, పాడైపోయిన ఆకులు, తేమ ఎక్కువగా ఉన్న ఆకులు తీసుకురాకూడదని అన్నారు. అలాంటి ఆకులున్న చెక్కులను వెనక్కి పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం, మార్క్‌ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, జిల్లా మేనేజర్ కరుణశ్రీ పాల్గొన్నారు.

అన్నదానంలో ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలులో అన్నదానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వినాయక చవితి వేడుకల్లో శాసన సభ్యులు నక్క ఆనందబాబు అన్నదానం ప్రారంభించారు. భక్తులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వేమూరు పిఎసిఎస్ అధ్యక్షులు పూసా రాజేష్, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ రూ.1.30 లక్షలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మక్కెనవారిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుని బొమ్మ నిమజ్జనం ఆదివారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా 10 కేజీల లడ్డును వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏలూరు వీరాంజనేయులు రూ.1.30లక్షలకు వేలంలో దక్కించుకున్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

మద్యం మత్తులో అతివేగంగా వాహనం నడుపుతూ అదుపుతప్పి పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన డేవిడ్ అనే వ్యక్తి రేణంగివరం వైపు వెళుతూ క్రిందపడి గాయపడ్డాడు. పట్టణంలోని గరటయ్య కాలనీ సమీపంలో జరిగిన ఘటన గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడుని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని అడవిపాలెం సమీపంలోని కృష్ణనది నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం (40) లభ్యమైనట్లు రూరల్ సిఐ ఆర్ సురేష్ బాబు తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. మృతుని ఛాతిపై కోటేశ్వరమ్మా అనే పచ్చ బొట్టు ఉందని తెలిపారు. మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అధ్వానంగా చెన్నుబొట్లవారిపాలెం రోడ్డు

- హైవే నిర్మాణంతో పాడైన రోడ్డు
- రోడ్డు బాగుచేయాలని గ్రామస్తులు వినతి
- గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని అభ్యర్థన

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెన్నుబొట్లవారిపాలెంకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. తిమ్మరాజుపాలెం నుండి నేరుగా చెన్నుబొట్లవారిపాలెంకు వెళ్ళడానికి రోడ్డు ఉండేది. ఈ రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో వాహన దారులు, గ్రామస్తులు ప్రయాణించలేని పరిస్థితి దాపురించింది. హైవే నిర్మాణానికి రోడ్డు గుండా పెద్ద పెద్ద టిప్పర్లు తిరగడంతో రోడ్డంతా గుంతల మయమైంది. గతంలో తారు రోడ్డుగా ఉండేది. ఇప్పుడు మట్టి రోడ్డుగా తయారైంది. వర్షా కాలంలో బురదమయం కావడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. తిమ్మరాజుపాలెం, చెన్నుబొట్లవారిపాలెం రెండు గ్రామాల శివారు గుండా పిడుగురాళ్ళ, వాడరేవు 167ఏ జాతీయ రహదారి నిర్మాణం జరుగు

తిమ్మరాజుపాలెం నుండి చెన్నుబొట్టవారిపాలెం రోడ్డు

తుంది. దీంతో చెన్నుబొట్లవారిపాలెంకు వెళ్లడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవేకు ఒకవైపు తిమ్మరాజుపాలెం బీసీ కాలనీవాసులు, మరోవైపు తిమ్మరాజుపాలెం ఎస్సీ కాలనీవాసులు ఉన్నారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల మధ్య హైవే పనులు పూర్తయినప్పటికీ తిమ్మరాజుపాలెం రెండు వైపులా సర్వీసు రోడ్లు ఉన్నాయి. వీటి గుండా ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణించి ప్రజలు తిమ్మరాజుపాలెం చేరుకుంటున్నారు. తిమ్మరాజుపాలెం బస్ స్టాప్ నుండి చెన్నూబొట్లవారిపాలెం చేరుకోవాలి. సుమారు 4కిలోమీటర్ల దూరం ఆ గ్రామస్తులు ప్రయాణం చేయాలి. సర్వీసు రోడ్డు తిమ్మరాజుపాలెంలో ప్రవేశించే, బయటకు వెళ్లే చోట ఆర్టీసీ బస్సు ఆపడం లేదు. కేవలం గ్రామంలో మాత్రమే ఆపుతారు. ద్విచక్ర వాహన దారులు మాత్రం సర్వీసు రోడ్డు గుండా ప్రయాణిస్తున్నారు. కాలినడకన వెళ్లే గ్రామస్తులు బురదమయమైన ఈ రోడ్డు గుండా ప్రయాణించి హైవేకి అవతలకు చేరుకోవాలి. అక్కడి నుంచి చెన్నుబొట్లవారిపాలెం చేరుకోవాలి. హైవే దాటి వెళ్ళేటప్పుడు ప్రజలు, వాహనదారులు ఇరువైపులా చూసుకొని వెళ్లాల్సి ఉంటుంది. లేకపోతే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. హైవే నిర్మాణం వల్ల పాడై, అధ్వానంగా మారిన చెన్నుబొట్లవారిపాలెం రోడ్డును ఆర్అండ్‌బి అధికారులు, పిడుగురాళ్ల, వాడరేవు రోడ్డు నిర్మించే అధికారులు బాగుపర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అప్పుడే తమ గ్రామానికి వెళ్లే ఇక్కట్లు తగ్గుతాయని అంటున్నారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

కొద్దిపాటి వర్షానికే నీట మునిగిన పొలాలు

ప్రజాశక్తి - బట్టిప్రోలు

మురుగు నీరు పారుదల మార్గం లేక రైతులు సాగు చేసిన పంట ప్రతి ఏట నీట మునిగి పాడైపోయి రైతులు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. గత కొన్నేళ్లుగా డెల్టా ప్రాంతంలో మురుగు కాలువల పూడికతీత లేక కట్టలు బలహీనపడ్డాయి. కాలువల్లో పెద్ద పెద్ద చెట్లు అడ్డుపడి మురుగు నీరు పారుదల కావడం లేదు. దీంతో వరి పంట నీట మునిగి రోజులు, నెలలు తరబడి నీరు నిలిచి పంట పూర్తిగా దెబ్బ తింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రైతులు అధిక శాతం వెద పద్ధతిన వరి సాగు చేశారు. సాగు చేసిన పంట ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు ఇప్పటికే రెండు సార్లు నీట మునిగి దెబ్బ తినింది. మరోమారు సాగు చేయటానికి కూడా అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని సూరేపల్లి మెయిన్ డ్రైన్ పూర్తిగా కట్టలు బలహీనపడ్డాయి. పూడిపోయి, కాలువకు చెట్లు అడ్డుపడ్డాయి. నీరు ప్రవహించే పరిస్థితి లేదు. దీంతో ఈ పరిధిలో 200 ఎకరాల్లో పంట దెబ్బతింటుంది. ఈ కాలువ వేమవరం నుండి ప్రారంభమై ఐలవరం, పెద్దవరం, జిల్లేపల్లి మీదుగా పల్లెకోన వద్ద

నీట మునిగిన భట్టిప్రోలు బాడవ పొలాలు

బిఎం డ్రైన్‌లో కలుస్తుంది. ఈ కాలువ ప్రారంభం నుండి ఐదారు వంకరలు ఉండటంతో నీరు వేగంగా పారుదల అయ్యే పరిస్థితి లేదు. జిల్లేపల్లి నుండి పల్లెకోన మెయిన్ డ్రైన్ వరకు కట్టలను కొందరు రైతులు పంట పొలల్లో కలుపు కోగా మరి కొందరు అక్రమంగా కట్టలను త్రవ్వుకొని సొమ్ము చేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అద్దేపల్లి నుండి ప్రారంభమై గూడవల్లి, గంగోలు వరకు ప్రవహించే కనగాల అప్లుయెంట్ మురుగు కాలువ గుర్రపు డెక్క పేరుకుపోయి, చెట్లు విరిగి కాలువలో పడి నీరు ప్రవహించే పరిస్థితి లేదు. ఈ కాలువ సమీపంలోని వందల ఎకరాల పంట నీట మునిగి దెబ్బతింటుంది.

డెల్టా ఆధునీకరణ అనంతరం అభివృద్ధి శూన్యం

డాక్టర్ వైఎస్ఆర్ పాలనలో డెల్టా ఆధునికరణ పేరుతో మురుగు, సాగునీరు కాలువలు అభివృద్ధి చేశారు. ఆ సమయంలో కాలువ పూడికతీత చేపట్టి కట్టలు బలపరిచారు. అవసరమైన ప్రాంతంలో వంతెనలు నిర్మించారు. అనంతరం గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో ఎక్కడా ఒక్క పార మట్టి తీసిన దాఖలాలు లేవని, దీని కారణంగా పూడికతీత పేరుకుపోయి ప్రతి ఏట పంటలు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మురుగు నీటి, సాగునీటి కాలువల అభివృద్ధి పనులు నీటి సంఘాల ద్వారా చేపట్టినప్పటికీ అది పూర్తిస్థాయిలో జరగక పోవడంతో పనులు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతుల చెబుతున్నారు. ప్రస్తుతం నీట మునిగిన భట్టిప్రోలు, అద్దేపల్లి బాడవ పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు తరలించేందుకు కాలువలకు అడ్డుపడిన చెట్లు, గుర్రపు డెక్క తొలగించేందుకు అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్తు వైర్లు చోరీ

విద్యుత్తు వైర్లు లేని స్తంభాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లే కాదు నివాస గృహాల కోసం ఏర్పాటు చేసిన కాలనీల్లో సైతం విద్యుత్తు వైర్లు చోరీకి గురికాక తప్పడం లేదు. భట్టిప్రోలు జగనన్న కాలనీలో మూడు లేఔట్లు ఉండగా వాటిలో 3వ లేఅవుట్లో రెండు విడతలుగా విద్యుత్ స్థంబాకున్న వైర్లు దొంగిలించారు. కాలనీలో ప్రజలకు కనీస సౌకర్యాలు లేక నివాసాలు ఏర్పాటు చేసుకోకపోవడంతో పట్టించుకునే వారు లేకపోవడంతో దొంగలపాలవుతున్నాయి. విద్యుత్ స్తంభాలకున్న అల్యూమినియం విద్యుత్ వైర్లను వందల మీటర్ల కొద్ది కట్ చేసి దొంగిలించారు. దానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని లబ్ధిదారులు అంటున్నారు. వెయ్యి మందికి పైగా పట్టాల మంజూరు చేశారు. కాలనీలో కనీస వసతులు లేకపోవడం, నివాస గృహాలు ఏర్పాటుకు యోగ్యంగా లేకపోవడంతో లబ్ధిదారులు 70శాతంపైగా ఇళ్లు నిర్మించుకోలేదు. నిర్మాణాలు లేకపోవడంతో కాలనీ ప్లాట్లు మొత్తం రెళ్ళు గడ్డితో నిండిపోయింది. దొంగలకు అనుకూలంగా మారింది. చీకటపడితే జనసంచారం కనిపించదు. ఏపుగా దట్టంగా పొదలు ఉండటంతో పట్టపగలే తిరగటానికి లబ్ధిదారులు భయపడుతున్నారు. రోడ్లు, త్రాగునీటి వసతి లేదు. కాలనీలో మేరక లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణాలకు మెటీరియల్ నిల్వ చేస్తే వాటినీ దొంగిలిస్తున్నారని ఆవేద రక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలకున్న వైర్లనే దొంగిలిస్తే ఇళ్ల నిర్మాణానికి తెచ్చుకునే విలువైన వస్తువులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కాలనీలో చోరీకి గురైన విద్యుత్తు వైర్లపై విచారణ జరిపి దొంగలను గుర్తించాలని కోరుతున్నారు. కాలనీలో పేరుకుపోయిన రెళ్ళు గడ్డిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ ఎఈ శాంతకమారి మాట్లాడుతూ జగనన్న కాలనీలో రైల్వే ట్రాక్ సమీపంలో రెండు విడతలుగా విద్యుత్ వైర్లు చోరీకి గురైనదని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జగనన్న కాలనీలో పెరిగిపోయిన రెళ్ళు గడ్డి

రైతులు నిలిపేసిన మట్టి లారీలు

పంటలు నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - అద్దంకి

రైతులు వేసిన పంటలకు నష్టం కలిగిస్తూ మట్టి తరలించే టిప్పర్ల యజమానులకు అనేకమార్లు రైతులు చెప్పినప్పటికీ లెక్కచేయకుండా మట్టి తరలిస్తున్నారు. మట్టి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకుని నిరసన తెలిపారు. మండలంలోని చిన్నకొత్తపల్లి, శ్రీనివాస నగర్ గ్రామాలకు చెందిన రైతులు వెంపరాల కొండ నుండి గ్రీన్ ఫీల్డ్ హైవేకు తరలిస్తున్న మట్టి టిప్పర్ల వలన మినుము, వరి, సొర, మొక్కజొన్న పంటలపై దుమ్ము అధికమై పంట నష్టం వాటిల్లుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. టిప్పర్ల యజమానులకు తమ ఇబ్బందిని చెప్పారు. అయినప్పటికీ పట్టించుకోకుండా యధావిధిగా మట్టి తరలిస్తున్నారు. దీంతో టిప్పర్లను రైతులు అడ్డుకున్నారు. టిప్పర్లలోని మట్టిపై నీరు జల్లి తరలించండని రైతులు సూచన చేసినప్పటికీ పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈపాటికే ఆకు కూరలు, మొక్కజొన్న, వరి, సొర సాగు వేసిన రైతులకు భారీగా నష్టపోరారు. కార్యక్రమంలో మండవ వెంకట్రావు, వెంకటేశ్వర్లు, నూతి వెంకటస్వామి, ధూళిపాళ్ల వీరాంజి, చప్పిడి రామారావు, పప్పిడి రవీంద్ర, రావి సోమయ్య పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిని వదిలేసిన ప్రభుత్వం

- జగనన్న కాలనీ ప్రజల బాధలు వర్ణనాతీతం
- సమస్యలు పట్టించుకోని నేతలపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని జగనన్న కాలనీల అభివృద్ధిని ప్రభుత్వం వదిలేసింది. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఓట్లేసిన ప్రజలకు కాలనీలో కనీస వసతులు కల్పించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. వర్షం కురిస్తే రోడ్లపై వర్షం నీరు నిలుస్తుంది. అడుగుపెట్టే పరిస్థితి లేదు. మోకాల్లోతు నీళ్లలో బడి పిల్లలను తీసుకొని ఇంటికి చేరాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్యాడిసన్ పేట జగనన్న కాలనీలో రెండు వేల ఫ్లాట్లలో వెయ్యికి పైగా ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. 500 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వర్షం కురిస్తే ఆయా ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అదీ కాక కాలనీకి వైపు వ్యవసాయ పంట భూములు ఉండడంతో నీళ్లలో పాములు సంచరిస్తున్నాయి. వర్షపు నీళ్లు బయటికి వెళ్లే డ్రైనేజీ సౌకర్యం లేక కాలనీలో ఉండే ప్రజల అల్లాడుతున్నారు. భూగర్భ జలాలు ఉప్పు నీళ్లు కావడంతో వాడుకునేందుకు పనికి రాకుండా ఉన్నాయి. దీంతో ట్యాంకర్ ద్వారా వచ్చే నీటిని త్రాగడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఆ టాంకర్లు వారానికోసారి వస్తున్నాయి. మినరల్ వాటర్ కొనుక్కోవాల్సి వస్తుంది. కాలనీలో సౌకర్యాల కల్పనలో వెనుకబడి ఉంది. గత ప్రభుత్వంలో ఇచ్చిన కాలనీలో మౌలిక వసతులు కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలో మూడు ప్రాంతాల్లో 3500 మందికి పైగా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు అందజేశారు. మూలపాలెం కాలనీలో వెయ్యి, పాడిసన్ పేటలో 1800, 750 ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అప్పట్లో ఇల్లు కట్టకపోతే ప్లాట్ల పట్టాలు తీసేసుకుంటామని మున్సిపల్, గృహ నిర్మాణ అధికారులు లబ్ధిదారులను బెదిరించారు. దీంతో అప్పులు చేసి ఇల్లు కట్టుకున్న కొందరు అప్పులు తీర్చలేక వడ్డీలు చెల్లిస్తూ అతి కష్టంపై కాలనీలో నివాసాలు ఉంటున్నారు. కూటమి ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తారని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఈ కాలనీల్లో అభివృద్ధిపై ప్రస్తుత పాలకులు దృష్టి పెట్టక పోవడంతో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల లక్ష్యం నెరవేరకుండా పోతుంది. గత ప్రభుత్వంలో వచ్చిన ఇళ్ల స్థలాలు ఎందుకు అభివృద్ధి చేయాలనే ధోరణితో ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపిస్తున్నారు. మూలపాలెం కాలనీలో 200 కుటుంబాలు ఉంటున్నారు. జలుజీవన్ మిషన్ ద్వారా గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా త్రాగునీరు అందించేందుకు పైపులైన్లు వేశారు. అయితే పురపాలక మంచినీటి పథకం ద్వారా ఉప్పరపాలెంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు నింపేందుకు పైప్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలనీలో సురక్షిత నీటిని ఇవ్వాలని కోరుతున్నారు. మూడు కాలనీలు పల్లపు ప్రాంతాల్లో స్థలాలను ఇవ్వడంతో వర్షపునీరు నిలిచిన పాములు, దోమలతో కాలంగడపాల్సి వస్తోంది. మున్సిపల్ అధికారులు టాంకర్ల ద్వారా అరకొరగా త్రాగునీటి సరఫరా చేస్తున్నారు. ప్యాడిసన్ పేట కాలనీని వర్షపు నీరు వదలడం లేదు. అద్దె ఇళ్లల్లో ఉండలేక, అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లల్లో ఉండాలంటే రహదారులు లేక యాతన పడుతున్నారు.

వర్షపు నీటిలో కాలనీ వాసులు

కష్టాలు పడుతున్నాం

నాలుగేళ్ల నుంచి జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నామని కాలనీవాసి యనమల షారోను వాపోయారు. రోడ్లపై నీళ్ళు నిలవడంతో ఇబ్బంది పడుతున్నామని అన్నారు. వీధి దీపాలు లేవు. వర్షపు నీరు పోయే మార్గం లేదని, అనేక అగచాట్లు పడుతున్నామని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వృద్ధులు, పసిపిల్లల బాధలు చెప్పే వీలులేదని అన్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. ఓట్ల సమయాల్లో తమకు ఓట్లు వేస్తే అన్ని సౌకర్యం కల్పిస్తామన్న నాయకులు ఇంతవరకు కనపడలేదని అన్నారు. నమ్మి ఓట్లేసినందుకు శిక్ష అనుభవిస్తున్నట్లు తెలిపారు.

యనమల షారోన్

పొలాల్లో పాములన్నీ కాలనీలోనే

పొలాల్లో పాములు కాలనీలోనే సంచరిస్తున్నాయ కాలనీలో నివాసం ఉంటున్న కొమ్మన బోయిన లక్ష్మి అన్నారు. రోడ్లపై నీళ్లు నిలవడంతో ఇంట్లోకి వెళ్లాలంటే పాములతో భయపడి చస్తున్నామని అన్నారు. పాములు, కప్పలు, తేళ్లతో కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిపారు.

కొమ్మనబోయిన లక్ష్మి

కాలనీలో తాండవిస్తున్న సమస్యలు

పట్టణంలో జగనన్న కాలనీల్లో సమస్యలు తాండవిస్తున్నాయని సిపిఎం పట్టణ నాయకులు కె శరత్ చెప్పారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ కాలనీలు ఉన్నాయో లేదో కూడా ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలోని జగన్ కాలనీలు తామెందుకు ఎందుకు అభివృద్ధి చేయాలనే నిర్లక్ష్యం వెంటాడుతోందని అన్నారు. మున్సిపాలిటీలో రూ.కోట్ల ప్రజాధనం ఉన్నప్పటికీ అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

కె శరత్, సిపిఎం పట్టణ నాయకులు

ఆరుద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తెలుగు సాహితీ రంగంలో ఆరుద్ర అగ్రగణ్యులు

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు సాహిత్యాన్ని అందంగా అలంకరించిన ఆరుద్ర అగ్రగణ్యులని కవి, ప్రజా వైద్యులు డాక్టర్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. ఆరుద్ర శతజయంతి సందర్భంగా సాహితీ భారతీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరుద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఆంధ్ర సాహిత్యం పేరుతో 12 సంపుటాల తెలుగు సాహిత్య ఘనత, ఘన చరితను ప్రచురించి తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసిన మహాకవి ఆరుద్ర అన్నారు. సాహితీ రగంలో చెరగని ముద్ర వేసుకున్న ఆరుద్ర రచనలు సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టాయన్నారు. ఆరుద్ర రచనలు తెలుగు సంస్కృతి, సామాజిక చైతన్యంకు ప్రతీకగా నిలిచాయని అన్నారు. తెలుగు సాహిత్య రంగంలో ఆరుద్ర రచనలకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. తెలుగు సాహిత్య గొప్పతనం ఆరుద్ర రచనల్లో చూడవచ్చని అన్నారు. సామాజిక అంశాలపై ఆయన రచనలు ప్రేరణ ఇచ్చాయని అన్నారు. కార్యక్రమంలోసాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ, కోశాధికారి ఆదం షఫీ, ఎం జాకబ్, మర్రి మాల్యాద్రిరావు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కె కాళిదాసు తదితరులు ఆరుద్ర, రాజశ్రీ చిత్రపటాలకు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు.

అడవిని తలపిస్తున్న శ్మాశాన వాటిక

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరులో నామ్ హైవే పక్కన ఉన్న హిందూ స్మశాన వాటికలో చిల్లచెట్లు, ముండ్ల పొదలతో నిండి అడవిని తలపిస్తోంది. ఒకప్పుడు 5 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ స్మశాన భూమి అక్రమార్కుల ఆక్రమణలతో రెండెకరాలకే పరిమితమైంది. పాలకులు, అధికారులు మారుతున్నప్పటికీ స్మశాన అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. స్మశాన వాటికలో చనిపోయిన వారి మృత దేహాలను చివరిమజిలీకి సాగనంపేందుకు స్మశానంలోకి వచ్చిన వారికి పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లతో కమ్మేసి దర్శనం ఇస్తా ఉంది. స్మశానంలోకి వచ్చిన వారు 'చచ్చినా సావేరా' అంటూ మనోవేదనకు గురవుతున్నారు. గ్రామంలో 15 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ఇందులో ఎక్కువ భాగం హిందువు సాంప్రదాయ పద్దతిలో మృతదేహాలకు దహన సంస్కారాలు చేస్తుంటారు. కొంతమంది భూమిలో ఖననం చేస్తుంటారు. ఈ స్మశాన వాటికలో భూ విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల మృతులను పూడ్చిన గుంతల్లోనే మరికొందరిని పూడ్చాల్సి వస్తుందని, దీంతో దుర్గందం వెదజల్లుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలు, పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణమే స్మశాన భూమి ఆక్రమణలు తొలగించాలని, చిల్లచెట్లను తొలగించి స్మశానం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ముళ్లచెట్లతో దర్శనమిస్తున్న స్మశాన స్థలం

శరవేగంగా పర్చూరు వాగు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు, కారంచేడు మధ్య (ఉప్పుటూరు వరద) వాగు ఆధునికరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వర్షాకాలంలో వరదలకు పంట పొలాలు మునిగి పోకుండా ఈ వాగు ఆధునీకరణతో లక్షలాది ఎకరాలకు మేలు చేస్తుంది. గత వైసిపి ప్రభుత్వంలో అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఉప్పుటూరు వాగు ఆధునికరణకు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శ్రీకారం చుట్టారు. వరద ఉధృతి తగ్గించి పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టారు. వాగులో నీటి ప్రవాహానికి అడ్డుగా ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలను జెసిబిలతో తొలగిస్తున్నారు. వాగు కట్టలు బలోపేతం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న వాగులో పూడికతీత పనులు చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్చూరు, కారంచేడు మధ్యలో ఉన్న 4 కిలోమీటర్లు మేర వాగును లక్షల వ్యయంతో పూడికతీత పనులు చేపట్టారు. వరద ఉధృతి పొలాలపైకి రాకుండా వాగు అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూసుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు వాగులో జంగిల్ తొలగిస్తున్న దృశ్యం

నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

గుండెపోటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని చింతపల్లిపాడుకు చెందిన వేంపరాల జితేంద్ర పవన్ కుమార్ (24) గుండె నొప్పితో శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, మాజీ జెపిటిసి బత్తుల శారమ్మ, జాన్ నెహ్రూ ఆదివారం మృతునికి వేరు వేరుగా నివాళులర్పించారు. యువకుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. యువకుని మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. టిడిపి ప్రొఫెషనల్ వింగ్‌లో పవన్ చురుగ్గా పనిచేశాడని అన్నారు. అతని కుటుంబ సభ్యులకు టిడిపి అండగా ఉంటుందని అన్నారు. మృతునికి తండ్రి శ్రీనివాసరావు, తల్లి మాధరి, సోదరుడు మహేష్ ఉన్నారు. ఎంఎల్ఎ వెంట టిడిపి నాయకులు రావిపాటి సీతయ్య, రంగయ్య చౌదరి, కె నాగేశ్వరరావు, అంకమ్మ చౌదరి, రామారావు, బంధువులు రాజశేఖర్, శ్రీను ఉన్నారు.

అలల్లో కొట్టుకు పోతున్న యువకుడిని ఒడ్డుకు చేర్చిన పోలీసు

యువకుడిని రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక సముద్ర తీరంలో స్నానం చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతున్న యువకుడిని మెరైన్ పోలీసులు రక్షించారు. గుంటూరు ప్రాంతం నుండి సూర్యలంక సముద్ర తీరానికి ఆదివారం వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు అలల ఉధృతికి కొట్టుకుపోతుండగా అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. ప్రాథమ చికిత్స అనంతరం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

స్వచ్ఛాంధ్ర మిషన్ సంచాలకుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణానికి చెందిన చిన్ని శ్రీనివాసరావును రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ సంచాలకునిగా నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది సంచాలకులతో కూడిన కమిటీని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మాజీ వైస్ ఛైర్మన్‌గా, టిడిపి పట్టణ అధ్యక్షునిగా సేవలు అందించిన శ్రీనివాసరావు కృషిని గుర్తించి నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను చుండూరి మురళీ సుధాకర్, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, ఎర్రమోతు శంకరరావు, పూనూరి నరేంద్ర, మన్నం త్రిమూర్తులు ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకులను గుర్తించి బాధ్యతలు అప్పగించడం ద్వారా తక్కువ స్థాయి నాయకులకు ఉత్సాహాన్ని కలిగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు, మిత్రులు అభినందించారు.

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ప్రజాశక్తి-మద్దిపాడు

వివిధ రంగాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. మద్దిపాడులో సిఐటియు మండల మహాసభ ఎస్‌కె. కాసిం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్రానికి ముందు నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులపై మరింత భారాలు పెరిగే విధంగా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుకూలంగా స్కీం వర్కర్ల వేతనాలు పెరగటం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందన్నారు. కార్మికులను ఐక్యం కాకుండా మతం కులం పేరుతో వారి మధ్య అనైక్యత తెస్తుందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవడం కోసం పోరాడాలన్నారు. అనంతరం మండల సమన్వయ కమిటీని తొమ్మిది మందితో ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా ఉబ్బా ఆదిలక్ష్మిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆశా, ఆటో, గ్రోత్ సెంటర్, బిల్డింగ్ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్‌పి తుషార్ దూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు సేవలు అందించడం అభినందనీయమని ఎస్‌పి తుషార్ దూడి కొనియాడారు. బాపట్ల జిల్లా పిజిఆర్ఎస్ సెల్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన డివి.డేవిడ్, స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఎన్.రామకోటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి ఆధ్వర్యంలో ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్‌పి వారి కుటుంబ సభ్యులు పూలమాల వేసి, దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే పోలీస్ శాఖ విధులు బిన్నంగా, ఒత్తిడితో కూడుకొని ఉంటాయన్నారు. 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు భద్రత కల్పించాల్సిన గొప్ప బాధ్యత పోలీస్ శాఖపై ఉంటుందన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీస్ ఉద్యోగంతోనే సాధ్యమన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన ఉద్యోగంలో చేరడం గొప్ప అదష్టమన్నారు. సుదీర్ఘకాలం పాటు విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని కొనియాడారు. పోలీస్ శాఖలో విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ చేస్తున్న వారిని సన్మానించే అవకాశం తన రావడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఉద్యోగ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంపై దష్టి సారిస్తూ ఆహ్లాదకరంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి పి. విజయసారథి, వెల్ఫేర్ ఆర్ఐ మౌలిద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- యంత్ర పరికరాల పంపిణీ
- అందుబాటులో ఎరువులు
- బర్లీ పొగాకు సాగు నిషేధం
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం. సుబ్రమణ్యేశ్వరరావు



ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా తాము పనిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం. సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. రైతులు పంటల సాగు చేపట్టిన దగ్గర నుంచి పంటల ఉత్పత్తి, కనీస మద్దతు ధర లభించే వరకూ అన్ని అంశాలలోను రైతులకు అండగా ఉండేందుకు వ్యవసాయ శాఖ ద్వారా పలు రైతు సంక్షేమ,అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, సేవల గురించి ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.అవన్నీ ఆయన మాటాల్లోనే...

రైతులకు అన్ని అంశాల లో అండగా ఉండేందు కోసం బహుళ ప్రయోజనకర ఉపయోగం కోసం సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. భూసార పరీక్షల నుంచి పంట సాగులో మెళుకువలు తెలియజేయడం, రైతులకు కావాల్సిన సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నారు. సబిడీస్పై యంత్ర పరికరాలను అందించడం, పొలంబడి ద్వారా వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు రైతుల వద్దకు చేరేలా రైతు సేవా కేంద్రాల ద్వారా కృషి చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్-2025 పంట కాలానికి సాధారణ సాగు విస్తీర్ణం 3,24,345 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,77,500 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి, మొక్కజొన్న ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన యూరియా, డిఎపి నిల్వలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్, డిసిఎంఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులను అందజేస్తున్నారు. రైతులు యూరియాను అవసరం మేరకే కొనుగోలు చేయాలి. డీలర్లు యూరియాను రైతులకు బస్తా రూ.266.50 అమ్మాలి. అధిక ధరలకు అమ్మితే సంబంధిత డీలర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. యూరియా అమ్మకాలపై నిరంతర నిఘా కోసం తహశీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టర్ , వ్యవసాయ అధికారితో మండల స్థాయి నిఘా బందం ఏర్పాటు చేశారు. జిల్లాలో యూరియా లభ్యత, అమ్మకం ఇతర వివరాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ సెల్ నెంబరు 8247040131కు రైతులు ఫిర్యాదు చేయవచ్చు.

యంత్ర పరికరాల పంపిణీ

2025 ఏప్రిల్,మే జూన్ నెలల్లో జిల్లాలో 1,061 మంది రైతులకు సబ్సిడీపై రూ.2.10 కోట్ల విలువైన యంత్ర పరికరాలు అందజేశారు. 33 రైతు గ్రూపులకు డ్రోన్లు 80 శాతం రాయితీపై అందజేశారు. ఖరీఫ్‌లో ఇప్పటి వరకూ 93,615 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేశారు. 2025ఖరీఫ్‌లో జిల్లాలో లక్ష కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 38,165 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. జిల్లా వ్యవసాయశాఖ ద్వారా పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా ,భూసార పరీక్షలు,పొలంబడి, రాయితీ విత్తనాలు ,పచ్చిరొట్ట విత్తనాల సరఫరా చేశారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఇవి అమలు చేస్తుంది.

అందుబాటులో ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన 17,194 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 4,748 టన్నులు, డిఎపి 2,986, ఎంఒపి 520, ఎన్‌పికె కాంప్లెక్స్ 6,730, ఎస్ఎస్‌పి 2,210 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రానున్న కాలంలో కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను కొందరు వ్యవసాయేతర పనుల కోసం వినియోగిస్తున్న నేపథ్యంలో దీనికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. యూరియాను నాటు సారా, కోళ్ళ ఫారాలు, మత్స్య ఫారాలు,పశువుల గడ్డి, రంగుల తయారీలో వినియోగిస్తున్నారు. వాటిపై నిఘా ఉంచారు. వివిధ శాఖల సమన్వయంతో మండల కమిటీలు ఏర్పాటు చేసి వ్యవసాయేతర రంగంలో ఎక్కడైతే యూరియాని వాడుతున్నారో నిఘా పెట్టి వీటికి అడ్డుకట్ట వేసే చర్యలు చేపట్టారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1,60,441 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.108.57 కోట్లు జమ చేశారు. ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20 వేల వంతున ఈ పథకం ద్వారా అందుతాయి. విత్తనం నుంచి విక్రయం వరకూ రైతుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారు.

బర్లీ పొగాకు సాగు నిషేధం

జిల్లాలో ఈ ఏడాది బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు సాగును తాత్కాలికంగా నిషేధించారు. ఈ మేరకు జీవో ఆర్‌టి నెంబర్ 740 ఉత్తర్వులను ప్రభుత్వం అధికారికంగా జారీ చేసింది. ఏడాది పాటు పొగాకు సాగు నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ప్రస్తుతం బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధాజ్ఞలు విధించింది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దష్టి సారించేలా జిల్లా వ్యవసాయ శాఖ తగిన చర్యలు తీసుకుంటుంది. పొగాకు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.